క్లుప్తంగా

విద్యార్థులకు ఎంఈవో అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో

రాయికల్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి లో ప్రతిభ కనబర్చిన ఏముండ్ల శైలజ, కండ్లపల్లి రక్షిత, పెద్ది మహిత తోపాటు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులకు ఆదివారం ఎంఈవో రాఘవులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొన్నం రమేష్, మండలోజు రవీందర్, చిప్పమల్లేశం, గంగ జమున ,సత్యనారాయణ, గంగాధర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న ఎస్సై నవీన్‌కుమార్

కథలాపూర్: యువత సన్మార్గంలో నడవాలని, తల్లిదండ్రులు కూడా వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్సై నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని రాజారాం తండాలో శనివారం రాత్రి పోలీస్ కళాబృందం సైబర్ మోసాలు, రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. విద్యార్థులు, యువత గంజాయికి అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. పిల్లల పెంపకం, వారి నడవడికపై తల్లిదండ్రులు గమనించి వారు మంచి మార్గంలో వెళ్లేలా చూడాలన్నారు. పోలీస్ కళాబృందం సభ్యులు ఆట పాటలతో పలు అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి నాయక్, రమేశ్ నాయక్, రాము, రాజేశం, రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పడిన ధాన్యం బస్తాలు



రోడ్డు పై మీద పడిన ధాన్యం బస్తాలు

మల్యాల: మండల కేంద్రంలోని తూర్పువాడలో సోమవారం లారీలోంచి ధాన్యం బస్తాలు జారీ కింద పడ్డాయి. సామర్థ్యానికి మించి ధాన్యం బస్తాలు లారీల్లో లోడ్ చేసి, తరలిస్తుండగా రోడ్డుమీద పడిపోయాయి. అదృష్టవశాత్తు లారీ వెనక వాహనాలు రాకపోవడంతో ఎవరికీ గాయాలు కాలేదు. లారీల్లో సామర్థ్యాన్ని మించి ధాన్యం బస్తాలు లోడ్ చేస్తుండడంతో దారిలో విద్యుత్ తీగలతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని, అధికారులు స్పందించి, లారీల్లో అధిక లోడ్ తీసుకెళ్లకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం

కోరుట్లరూరల్: మండలంలోని చిన్నమెట్పల్లిలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, నాయకులు అర్మూర్ గంగాధర్, డైరెక్టర్లు, ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ వైరు తెగిపడి వాహనాలు దగ్ధం



పూర్తిగా కాలిపోయిన టాటా మ్యాజిక్

గొల్లపల్లి:విద్యుత్ వైరు తెగిపడి రెండు వాహనాలు, మొక్కజొన్న కంకులు దగ్ధమైన ఘటన మండల కేంద్రంలోని చైతన్యనగర్‌లో ఆదివారం జరిగింది. స్థానికుల వివరాలు.. చైతన్యనగర్‌లోని అర్చనపెల్లి పద్మ ఇంటి ముందు నుంచి సబ్‌స్టేషన్‌కు వెళ్లే 11కేవీ విద్యుత్ వైర్లు ఉన్నాయి. 11 కేవీ వైరు తెగిపడడంతో ఆటో, స్కూటీ, సుమారు 3 క్వింటాళ్ల మక్కకంకులు కాలిపోయాయి. వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని గతంలో పలుమార్లు అధికారులకు తెలిపినా, పట్టించుకోలేదని, తాత్కాలిక మరమ్మతు చేయడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

పశువైద్య కేంద్రాల్లో వసతులేవీ..?

- కనీస వసతులు లేని పశువైద్యశాలలు
- శిథిలావస్థకు చేరుతున్న పాత భవనాలు
- నూతన మండలాల్లో వైద్యుల పోస్టుల మంజూరు లేదు
- పశుపోషణపై ప్రభావం



వెల్గొండలో శిథిలావస్థకు చేరిన పశువైద్య ఉపకేంద్ర భవనం

బుగ్గారం: దేశం బాగుపడాలంటే పల్లెలు బాగుండాలి. పల్లెలు బాగుండాలంటే పల్లెల్లో ఆర్థికవృద్ధి జరగాలి. పల్లెల ఆర్థిక అభివృద్ధిలో వ్యవసాయానిది ప్రథమ స్థానమైతే పశుపోషణది ద్వితీయ స్థానం. ఏ వ్యవసాయ కుటుంబంలో చూసినా ఖచ్చితంగా కనీసం ఒక్క గేదెనో,ఆవునో కలిగి ఉంటారు. వాటిని కుటుంబ సభ్యుల్లా చూసుకుంటారు. వాటికి ఏదైనా అనారోగ్యం వస్తే ప్రైవేట్ దవాఖానాలు లేవు. ఉన్నవల్లా ప్రభుత్వ పశువైద్యశాలలే. అలాంటి పశు వైద్యశాలలు నేడు వసతుల లేమిలో కొట్టుమిట్టాడుతున్నాయి. కనీస సౌకర్యాలు లేక వెక్కిరిస్తున్నాయి. మండలంలోని వెల్గొండ, బుగ్గారం, మద్దునూర్ గ్రామాల్లో పశువైద్య కేంద్రాలుండగా వాటిలో సరైన మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలు కావడంతో శిథిలావస్థకు చేరాయి. అలాగే వాటికి కేటాయించిన స్థలం కూడా సరిపోవడం లేదు. దీంతో వైద్యం కోసం తీసుకువచ్చిన పశువులకు ఇబ్బందులు తప్పడం లేదు.కొన్నింటిలో విద్యుత్,నీటి సౌకర్యం కూడా లేదు.

శిథిలావస్థకు చేరుతున్నాయి

బుగ్గారం మండలంలోని వెల్గొండ పశువైద్యశాలను 1986 లో ప్రారంభించారు. ప్రస్తుతం ఇది పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో వర్షం పడినప్పుడల్లా భవనం మొత్తం తడిసి పోతోంది. లోపలి భాగం అంతా చెడిపోయింది. సీలింగ్ పెచ్చులూడిపోతూ సలాక తేలిపోయింది. దీంతో ఎప్పుడు కూలిపోతుందో అని భయంగా ఉంది. 5 వేల పశువులకు ఒక పశువైద్యుడు ఉండాల్సి ఉండగా బుగ్గారం మండలంలో ఒక్క పశువైద్యుడూ లేడు. నూతన మండలంలో ఇంకా సంబంధిత పోస్టు మంజూరు కాలేదు. ప్రస్తుతం ఎల్ఎస్ఏ లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. వారే అన్ని వ్యవహారాలు చూసుకోవాల్సి వస్తుంది. ఇటీవల నిర్వహించిన పశుగణనలో చేపట్టగా, గ్రామాల్లో పశువుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పశువైద్యకేంద్రాలలో మెరుగైన వైద్యసదుపాయాలు అందించాలంటే సిబ్బందిని కూడా పెంచాల్సి ఉంటుంది. ముఖ్యంగా వానాకాలం సీజనల్ వ్యాధులు విజృంభించిన సందర్భాల్లో సిబ్బంది కొరత వలన మెరుగైన వైద్యసేవలు అందక పశువులు ప్రాణాలు కోల్పోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే పశువులకు సరిపడా మందులు కూడా లేవు, దీంతో ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామీణ పశువైద్యకేంద్రాల్లో వసతులను మెరుగుపర్చాలని, అలాగే పశువులకు సరైన వైద్యసదుపాయాలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



బుగ్గారంలోని పశువైద్యకేంద్రం

ఎప్పుడు కూలుతుందో..?



ప్రస్తుతం మా గ్రామంలోని వెటర్నరీ ఆస్పత్రి భవనం పూర్తిగా శిథిలమైంది.లోపలి పైభాగంలో సీలింగ్ పెచ్చులూడుతోంది. సలాక తేలిపోయింది. వర్షం పడితే భవనం అంతా ఉరుస్తుంది. ఇప్పటికైనా నూతన భవనాన్ని నిర్మించాలి.

– పొదం సత్తయ్య,వెల్గొండ

ఉన్నతాధికారులకు నివేదించాం



పశువైద్య కేంద్రాల్లో వసతుల కల్పన గురించి ఉన్నతాధికారులకు నివేదించాం. ఇటీవలే లైవ్ స్టాక్ అసిస్టెంట్ సిబ్బంది కొరత తీరింది.అవసరమైన మౌలిక సదుపాయాల గురించి ప్రతిపాదనలు పంపించాము. నూతన భవనాలు నిర్మించాలని కోరాం.

– తిరుపతి,ఇన్‌చార్జి వెటర్నరీ వైద్యుడు, బుగ్గారం

బాధిత కుటుంబాలకు విద్యుత్ శాఖ చేయూత



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: విద్యుత్ షాక్‌తో మరణించిన కుటుంబాలకు విద్యుత్ సంస్థ ఆర్థిక సాయం అందిస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన మల్యాల నర్సయ్య, పట్టణంలోని 30 వ వార్డుకు చెందిన ఎండీ అయాన్ అహ్మద్ విద్యుత్ షాక్‌తో మృతి చెందగా, ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ 5 లక్షల చెక్కులను ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ దామోదర్‌రావు, నాయకులు రౌతు గంగారెడ్డి, మహేశ్, రాజ్‌కుమార్, విజయ్, శేఖర్ గౌడ్, శ్రీనివాస్, రాకేష్, రవిశంకర్, ఏడీఈ జవహర్ నాయక్, ఏఈలు ప్రవీణ్, సుందర్, సాయగౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: మండలంలోని గుల్లపేటలో భక్త మార్కండేయ ఆలయంలో ఆదివారం ఘనంగా గజ స్తంభ నవగ్రహా విగ్రహా ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జున్ను రాజేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, నాయకులు పాల్గొన్నారు.

14 మంది ఏఎస్సైల బదిలీలు

127 మంది కానిస్టేబుళ్లకు స్థాన చలనం

జగిత్యాలక్రైం: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న 14 మంది ఏఎస్సైలు, 127 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఎస్పీ అశోక్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మహ్మద్ అలీమోద్దీన్ కథలాపూర్ నుంచి కోరుట్లకు, సంగు భిక్షపతి కథలాపూర్ నుంచి కొడిమ్యాలకు, ఎస్.సూర్యనారాయణరాజు ధర్మపురి నుంచి వెల్గటూర్‌కు, రాజేషుని శ్రీనివాస్ మల్యాల నుంచి మేడిపల్లికి, మహ్మద్ సందాని జగిత్యాల ట్రాఫిక్ నుంచి ధర్మపురికి, సత్యనారాయణ మల్లాపూర్ నుంచి కోరుట్లకు, బొడ్డు ఆనందం కొడిమ్యాల నుంచి పెగడపల్లికి, మనుపతి సత్తయ్య పెగడపల్లి నుంచి కోరుట్లకు, ఎం.శ్రీనివాస్ వెల్గటూర్ నుంచి గొల్లపల్లికి, రవీందర్‌రావు మేడిపల్లి నుంచి రాయికల్‌కు, వెంకటరమణ వెల్గటూర్ నుంచి మల్యాలకు, దేవేందర్ రాయికల్ నుంచి ధర్మపురికి, పెంచాల శంకరయ్య రాయికల్ నుంచి మేడిపల్లికి, రాజేశం ధర్మపురి నుంచి వెల్గటూర్‌కు బదిలీ అయ్యారు.

నల్ల పోచమ్మ ఆలయానికి భూమిపూజ



ఆలయానికి భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి గ్రామ శివారుల్లోని పాటుమీది ప్రాంతంలో శ్రీ నల్లపోచమ్మ ఆలయానికి గ్రామస్తులు ఆదివారం భూమిపూజ చేశారు. రేచపల్లితో పాటు, లచ్చనాయక్‌తండా, మ్యాడారంతండా, భీంరెడ్డిగూడెం గ్రామల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని, పూజలు నిర్వహించారు. కాగా ఆలయ నిర్మాణం గ్రామస్తుల సహకారంతో చేస్తున్నట్లు నిర్మాణ బాధ్యులు పేర్కొన్నారు.

ట్రాన్స్‌కో నష్టాలకు చర్యలు

అకాలవర్షంతో ట్రాన్స్‌కో కు రూ. 65 లక్షల నష్టం



మరమ్మతు చేపడుతున్న విద్యుత్ సిబ్బంది

ఇబ్రహీంపట్నం : మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో ఈదురు గాలులు, వడగండ్ల వర్షం పడటంతో విద్యుత్ శాఖకు రూ. 65 లక్షల నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. అకాలవర్షం, ఈదురు గాలులతో మండలంలోని ఇబ్రహీంపట్నం , ఎర్దండి, కోజన్‌కొత్తూర్, కేశాపూర్, మూలరాంపూర్, అమ్మక్కపేట, డబ్బా, రాజేశ్వర్‌రావుపేట, వర్షకొండ, మేడిపల్లి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగి, ట్రాన్స్‌ఫార్మర్లు కింద పడి భారీ నష్టం జరగడంతో పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలో 11 కేవీ విద్యుత్ స్తంభాలు, 60, ఎల్టీ విద్యుత్ స్తంభాలు 176 విరిగిపోవడంతో పాటు 22 ట్రాన్స్‌ఫార్మర్లు గద్దెలపై నుంచి కింద పడి పగిలిపోయాయి. దీంతో గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు 7 ఏజెన్సీల ద్వారా 5 టీంలుగా వెళ్లి వెంటనే కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు. చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను తెప్పించి, అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఏఈలు సతీష్, ప్రశాంత్‌కుమార్ తెలిపారు. విద్యుత్ శాఖకు ఎన్నడు లేనివిధంగా భారీ నష్టం జరిగినట్లు ఏడీఈ మనో హర్ తెలిపారు. 96 మంది కార్మికులు, సిబ్బంది రేయింబవళ్లు శ్రమించి అన్ని గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణకు కృషి చేశారని, వినియోగదారులు కూడా సహకించారని పేర్కొన్నారు.

చెక్కులు పంపిణీ

కథలాపూర్: మండలంలోని అంబారిపేటలోఆలకుంట లక్ష్మి, కనికారపు రాజేశం, చింత రాకేశ్‌కు మంజూరైన సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధానకార్యదర్శి జవ్వాజి రవి, నాయకులు ఆదిరెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్యాల: మండలంలోని తాటిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగనుందని విద్యుత్ ఏఈ డీ.దయానంద్ తెలిపారు. వినియోగదారులు, రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

నేనూ తింటా ఐస్‌క్రీం..



ఐస్‌క్రీం తింటున్న కోతి

మల్యాల: వేసవి ఎండలు మండుతుండడంతో ప్రజలు చల్లని ఐస్ క్రీంలు తినడం తోపాటు చల్లని నీళ్లను తాగుతూ దాహార్తి తీర్చుకుంటున్నారు. కొండగట్టుకు వచ్చిన భక్తుల చేతిలో నుంచి ఐస్ క్రీంను ఓ వానరం లాక్కొని నేనూ తింటాను చల్లని ఐస్‌క్రీం అంటూ మనుషల లాగే వానరం కూర్చొని, ముందటి రెండు కాళ్లతో తింటుండడంతో భక్తులు ఆసక్తిగా చూశారు.



కథలాపూర్: మండలంలోని బొమ్మెన- గంభీర్‌పూర్ గ్రామాల మధ్య బొమ్మెన గ్రామ-శివారులో తారు రోడ్డు గుంతలమయంగా మారింది. తారు లేచిపోవడం, రోడ్డు పక్కన మట్టి కొట్టుకుపోవడంతో వాహనాలపై వెళ్లేవారు భయాందోళన చెందుతున్నారు. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
లక్ష్మీకాంత్,ఏఈ, రోడ్లు,భవనాల శాఖ కథలాపూర్, సెల్ నం.: 7702537843

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

పేదలను ఆదుకోవడానికే సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న నర్సింగరావు

మెట్‌పల్లి: పేదలను ఆదుకోవడానికే ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.3 కోట్ల సీఎంఆర్‌ఎఫ్ నగదును పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అల్లూరి మహేందర్‌రెడ్డి, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, జెట్టి లింగం, యామ రాజయ్య, చెర్లపల్లి రాజేశ్వర్ గౌడ్ తదితరులున్నారు.

మినీ స్టేడియంకు మరమ్మతులు చేయించాలని వినతి

కోరుట్ల పట్టణంలోని మినీ స్టేడియంలో ప్రహరీని నిర్మించాలని కోరుతూ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జువ్వాడి నర్సింగరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి, రాందాస్, కార్తీక్ తదితరులు ఉన్నారు.

సీఎంసహాయనిధితో పేదలకు లబ్ధి

కోరుట్లటౌన్: సీఎం సహాయనిధితో పేదలకు లబ్ధి చేకూరుతుందని కోరుట్ల సెగ్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతన చైర్మన్ ఛాంబర్‌ను ఆదివారం ప్రారంభించారు. అనంతరం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు. పేద మధ్యతరగతి ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కథలాపూర్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1999–2000 విద్యా సంవత్సరం పదోతరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. 25 ఏళ్ల తర్వాత కలిసిన ఈ విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆడుతూ పాడుతూ ప్రసంగాలు చేస్తూ ఆనందోత్సవాల మధ్య గడిపారు. కార్యక్రమంలో అప్పటి టీచర్లు భూమాచారి, అఖిల్ అహ్మద్, శ్రీనివాస్, అంజయ్య, రాజయ్య పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు,అధ్యాపకులు

కోరుట్లటౌన్: పట్టణంలోని పీఆర్‌బీఎం జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన 1992–94,1993–95 బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు స్థానిక శివసాయి గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముప్పై ఏళ్లకు ఎక్కడెక్కడో ఉన్న స్నేహితులందరిని పూర్వ విద్యార్థుల సమ్మేళనం వేడుకలో కలుసుకుని తమ తమ పాత మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందం పంచుకున్నారు. తమకు చదువు చెప్పిన అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.